వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 285 శనివారం | 25 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# భూ కబ్జాదారులపై ఉక్కు పాదం

పరకాల నియోజకవర్గం పరిధిలో భూ కబ్జాదారులకు పాల్పడుతున్న వారిపై ఉక్కు పాదం మోపుతామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. ఎవరు కబ్జాలకు పాల్పడినా సహించేది లేదన్నారు. వ్యాపారస్తులను బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడటాన్ని ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వ్యక్తులపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదన్నారు. అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుదామని, మన పరకాల నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములమవుదామంటూ ఆయన పిలుపునిచ్చారు.

– వరంగల్ వాయిస్, పరకాల

8లో



## తీన్మార్ మల్లన్నతోనే..
# పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం

బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

8లో



# బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి

అసత్యపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

ఆ పార్టీ నేతలు రఘునందన్ రావు, అరూరి రమేష్



2లో..

## చెప్పిన మాట వినడం లేదని..
# కన్న కొడుకు హత్య

మర్డర్ కేసులో తండ్రి అరెస్ట్

కేసును ఛేదించిన పోలీసులు

రేగొండ మండలం నారాయణపురంలో ఘటన

# ముగిసిన ప్రచారం



## మూటలు విప్పిన నేతలు

27న ఓటింగ్, జూన్ 5న కౌంటింగ్

బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నికలు

కొంపముంచిన రెన్యూవల్

గత ఎన్నికలతో పోల్చితే తగ్గిన ఓటర్లు




హోరాహోరీగా సాగిన వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉప ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీల మధ్యే గట్టి పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు నువ్వా.. నేనా అన్నట్లుగా తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నిక ఈ నెల 27వ తేదీ సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకుగాను వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే గత ఎన్నికలతో పోల్చితే పట్టభద్రుల ఓటర్లు తగ్గడానికి ఎన్నికల సంఘం కొత్తగా ప్రవేశ పెట్టిన రెన్యూవల్ పద్ధతే కారణంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం అంతా పోలింగ్ పనుల్లో నిమగ్నమైపోగా అభ్యర్థులు మాత్రం మూటలు విప్పే పనిలో పడినట్లు ప్రచారం సాగుతోంది. ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.1000 వరకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పుకొంటున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..

# ముగిసిన ప్రచారం

## మూటలు విప్పిన నేతలు



- 27న ఓటింగ్, జూన్ 5న కౌంటింగ్
- బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నికలు
- కొంపముంచిన రెన్యూవల్
- గత ఎన్నికలతో పోల్చితే తగ్గిన ఓటర్లు
- రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేడి
- సోమవారం నాటి ఎన్నిక కోసం పోటాపోటీ ప్రచారం
- మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా ఉప ఎన్నిక

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉప ఎమ్మెల్సీ ఎన్నికను ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ ఎస్, బీజేపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఇక్కడ పట్టు సాధించడం ద్వారా అన్ని వర్గాల్లో తమకే ఆదరణ ఉందని చెప్పుకునేందుకు అన్ని పార్టీలు పోటీ పడుతున్నాయి. ఈనెల 27న ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 4గంటలకు ముగిసింది. పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గంలోని 12 జిల్లాల్లో ఓటర్ల సంఖ్యను బట్టి మొత్తం 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పోలింగ్ కేంద్రాలన్నీ మండల కేంద్రంలోనే ఉండేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికలకు అవసరమైన సిబ్బంది, పోలీస్ బందోబస్తు, ఇతర సౌకర్యాలను ఇప్పటికే పూర్తి చేశారు. ఉప ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను మొత్తం 3,025 మంది పోలీస్ సిబ్బంది ఈ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

### పల్లా రాజీనామాతో..

2021లో జరిగి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. రెండో స్థానంలో తీన్మార్ మల్లన్న నిలిచారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ ఎస్ అభ్యర్థిగా జనగామ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన తమ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు బీఆర్ఎస్ శాయశక్తుల పోరాడుతోంది. దీన్ని కైవసం చేసుకొని పట్టభద్రుల్లో కూడా తమకే పట్టు ఉందని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ సీటు దక్కించుకుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెక్ పెట్టవచ్చనే ఆలోచన బీజేపీ ఉంది. ఈ మూడు పార్టీల వ్యూహాలతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హీట్ పుట్టిస్తోంది.

### తగ్గిన ఓటర్లు..

పట్టభద్రుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు మాత్రం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లు 5,05,565 కాగా 2024 ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఆ సంఖ్య 4,63,839 కి పడిపోయింది. దీనికి ప్రధాన కారణం ఎన్నికల సంఘం విధించిన రెన్యూవల్ పద్ధతే కారణంగా మారిందన్న ఆరోపణలున్నాయి. గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులంతా తిరిగి తమ ఓటును రెన్యూవల్ చేసుకోవాలంటూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చాలా మంది ఓటర్లు దీనిని పెడ చెవిన పెట్టడంతో కొత్త ఓటర్ల జాబితాలో రెన్యూవల్ చేసుకోని పేర్లు కనిపించడం లేదు. దీంతో గతంతో పోల్చితే సుమారు 40 వేల ఓటర్లు తగ్గినట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,73,406 మంది ఓటర్లుండగా, ఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,23,985 మంది, నల్గొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,66,448 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

### ప్రసన్నం చేసుకునే పనిలో..

ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో సోమవారం జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు ఎవరి పక్షాన నిలుస్తారనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. అయితే అన్ని పార్టీలు పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రచారం ముగియడంతో మూటలు విప్పే పనికి శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఇప్పటికే పట్టభద్రుల జాబితాను తీసుకున్న ప్రధాన పార్టీలు ఓటు హక్కు ఉన్న ఒక్కో అభ్యర్థికి రూ.500 నుంచి రూ.1000 అందజేస్తూ వారిని మభ్యపెడుతున్నట్లు సమాచారం. ఈ డబ్బులను నేరుగా ఓటరు ఇంటి వద్దకే వచ్చి అందజేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది.




### వైన్ షాపుల బంద్

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో రెండు రోజుల పాటు వైన్ షాపులు, బార్లు మూతపడ్డాయి. అదే తరహాలో ఈనెల 25వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు 48గంటలపాటు వైన్ షాపులు, బార్లు మూతపడనున్నాయి. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎన్నికలు జరిగే మూడు జిల్లాల్లో వైన్ షాపులను మూసి వేయాలంటూ ఎన్నికల సంఘం రాష్ట్ర ఎక్సైజ్ శాఖను ఆదేశించింది. ఈ మేరకు శనివారం సాయంత్రం 4గంటలకే లిక్కర్ షాపులు క్లోజ్ అయ్యాయి.

# విత్తన షాపులపై నిరంతర నిఘా పెట్టాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్
- ఫిర్యాదు మేరకు తనిఖీ చేసిన అధికారులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రైతులకు విత్తనాలు అమ్మే షాపులపై నిరంతర నిఘా పెట్టాలని, నకిలీ విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ దందాను అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ జిల్లా జేడీ ఇతర అధికారులు శనివారం విత్తన దుకాణాల్లో తనిఖీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ తనిఖీలు ఒక రోజుకే పరిమితమై తూతూ మంత్రంగా ముగిస్తే రైతులకు ఏమాత్రం ఉపయోగం ఉండదన్నారు. దీనిని నిరంతర ప్రక్రియగా చేపట్టాలని కోరారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే దళారులను, అమ్మే షాపులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని పీడీ ఆక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల అవసరాల దృష్టిలో పెట్టుకొని డిమాండ్ ఉన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి అధికారులకు విక్రయించే షాప్ యజమానుల లైసెన్సు రద్దు చేయాలన్నారు. ఈ క్రమంలో రైతు సంఘం తన వంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో విగ్నేష్, రైతు సంఘం జిల్లా నాయకులు సిరుల రవీందర్, బరుపాటి రవీందర్, బొల్లు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చెప్పిన మాట వినడం లేదని..

# కన్న కొడుకు హత్య

- మర్డర్ కేసులో తండ్రి అరెస్ట్
- కేసును ఛేదించిన పోలీసులు
- రేగొండ మండలం నారాయణపురంలో ఘటన



**వరంగల్ వాయిస్, రేగొండ :** కొడుకు చెప్పిన మాట వినడం లేదన్న కోపంతో కన్న తండ్రి కసాయిగా మారాడు. వ్యాపారం దివాలా తీయడానికి కొడుకే కారణమంటూ కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా కొడుకును అడ్డు తొలగించుకునేందుకు పథకం రూపొందించారు. పథకం ప్రకారం రాత్రి సమయంలో తన పథకాన్ని అమలు చేశారు. అయితే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తండ్రే కాలయముడుగా మారి కొడుకును హత్య చేసినట్లు గుర్తించారు. ఈ ఘటన రేగొండ మండలం నారాయణపురంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ యాదవ్, ఎస్సై ఎస్.రవికుమార్ హత్య వివరాలను వెల్లడించారు. రేగొండ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పెరుగు లింగమూర్తి రేగొండ, పరకాల, టేకుమట్ల మండల కేంద్రాలలో సూపర్ మార్కెట్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. లింగమూర్తికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా చిన్న కుమారుడు సాయి గణేష్ (23) చదువులో రాణించకపోవడంతో పరకాలలోని సూపర్ మార్కెట్ అప్పగించారు. సూపర్ మార్కెట్ వ్యాపారం దివాలా తీయడానికి కారణం కొడుకేనని భావించిన లింగమూర్తి ఆయనపై కక్ష పెంచుకున్నారు. చెప్పిన మాట వినసందునే వ్యాపారం దివాల తీసిందని ఆగ్రహంతో ఊగిపోయిన తండ్రి ఎలాగైనా కొడుకు అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నారు. అనుకున్నట్లుగానే సాయి గణేష్ ను హతమార్చాడు. గత ఏడాది నవంబర్ నెలలో జరిగిన సాయి గణేష్ మృతి అనుమానాస్పదం కావడంతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టంలో హత్య చేయడంద్వారనే సాయి గణేష్ మృతి చెందినట్లు తేలింది. దీంతో పోలీసులు కేసును లోతుగా విచారించారు. విచారణలో కన్న తండ్రే హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# బాధిత మహిళకు న్యాయం చేయాలి

## మోసం చేసిన రాముని శిక్షించాలి
## డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** నిరుపేద ఎస్టీ లంబాడి సామాజిక వర్గానికి చెందిన వికలాంగ మహిళ భూక్య సరితను మొదటి వివాహం చేసుకొని తనతో కూతురిని కనీ ఆమెకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకొని మోసం చేసి తప్పించు తిరుగుతున్న పూలాంటి రాముపై చర్య తీసుకొని బాధితురాలికి న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట బాధిత మహిళా కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమలాపూర్ గ్రామ పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న కమలాపూర్ వాసి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన పులాంటి రాము హనుమకొండ బాలసముద్రంలో నివాసముంటున్న భూక్య సరితను మాయ మాటలు చెప్పి లోబర్చుకొని మొదటి వివాహం చేసుకొని ఆమెతో కూతురిని కూడా కన్నాడని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యుల ఒత్తిడితో పులాంటి రాము బాధితురాలికి తెలియకుండా రెండవ వివాహం చేసుకొని మోసం చేసి తప్పించుకుంటున్నాడని, దీనిపై గతంలో బాధితురాలు హనుమకొండలోని మహిళా పీఎస్ లో ఫిర్యాదు చేయగా బాధితురాలికి మూడు లక్షల అరవై వేల రూపాయలతో పాటు, 60 గజాల ఇంటి స్థలాన్ని, పోషణ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.3000 ఇస్తామని పెద్దమనుషుల



సమక్షంలో రాము కుటుంబ సభ్యులు ఒప్పందం కుదుర్చుకున్నారని అన్నారు. అయినప్పటికీ కూడా బాధిత మహిళ భూక్య సరితకు చిల్లి గవ్వ కూడా ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, ఈ విషయమై గత పది రోజుల క్రితం సంబంధిత కమలాపూర్ పీఎస్ లో బాధిత మహిళా ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, పీడి యాక్ట్ నమోదు చేయాలని కోరారు. లేకుంటే బాధితురాలికి మద్దతుగా న్యాయం జరిగే వరకు గ్రామపంచాయతీ, పోలీస్ స్టేషన్, నిందితుడి ఇంటి ముందు ధర్నా చేస్తామని, డీబీఎఫ్ తో సహా ఇతర సామాజిక, దళిత, గిరిజన, ఆదివాసి, ప్రజా సంఘాల మద్దతు కూడా కట్టుకొని న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత మహిళ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

## శ్రీ వివేకానంద సేవ సంస్థ ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలోని శ్రీ వివేకానంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గత పది రోజుల క్రితం వడదెబ్బతో మృతి చెందిన చిలువేరు కమలాకర్ (35) కుటుంబాన్ని పరామర్శించారు. మృతిచెందిన కమలాకర్ కు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయిలకు దాతల సహకారంతో ఆర్థిక సహకారాన్ని శ్రీ వివేకానంద సేవ సంస్థ అధ్యక్షుడు ఆడెపు రమేష్, ఉపాధ్యక్షుడు బిల్లా రమేష్, కోశాధికారి లెంకలపల్లి స్వామి, కునమల్ల రవి, కామకోని రఘుపతి, మాజీ సర్పంచి గణిపాక శ్రీనివాస్, గనిపాక స్వామి, సభ్యులు పాల్గొని రూ.13,016లతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు.

# భవన నిర్మాణంలో నిబంధనలు బేఖాతరు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణం నడిబొడ్డులోని కూరగాయల మార్కెట్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అతి భారీ భవనం నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పురపాలక అధికారులు కళ్లు మూసుకొని ఉండటం విశేషం. కారణం మామూళ్ల మత్తా? అధికార పార్టీ ఒత్తిడులా? అని ప్రజల్లో అనుమానం వ్యక్తం అవుతోంది. వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే పరకాల బీజేపీ ఆధ్వర్యంలో పోరాటానికి చేయడానికి సమాయత్తం అవుతోంది. పరకాల పురపాలక సంఘం పరిధిలో జి ప్లస్ టు నిర్మాణాలకు మాత్రమే పర్మిషన్ ఉంటుంది. అలాంటిది జీ ప్లస్ ఫోర్ నిర్మాణం, ప్రమాదకరంగా సెల్లార్ నిర్మాణం జరుగుతున్న కూడా అధికారులకు ఇంత నిర్లక్ష్యమా అని పరకాల మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# బీజేపీ చొరవతో ప్రభుత్వ భూమికి రక్షణ




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని నూతన వంద పడకల హాస్పిటల్ నిర్మాణానికి పక్కనే ఉన్న సర్వే నెంబర్ 95లో గల సుమారు1500 గజాల ప్రభుత్వ భూమి అన్యాకాంతం కాకుండా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గత ప్రభుత్వానికి,నూతన ప్రభుత్వానికి స్థానిక తహసీల్దార్, ఆర్డీవోలకు మెమోరాండం ఇచ్చి నిరసన తెలపడంతో అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడినందుకు పరకాల బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ భూమిని ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని, ఇందుకోసం తగిన చొరవ తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ప్రభారి దేవనూరి మేఘనాథ్, పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు మార్త భిక్షపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, మాజీ పట్టణ అధ్యక్షుడు కానుగుల గోపి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, 36వ బూత్ అధ్యక్షుడు ముత్యాల దేవేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

## ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కిరణ్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సామాజిక సేవకుడిగా, ఉద్యమకారుడిగా, పోరాటమే ఊపిరిగా, ధిక్కారమే ఆయుధంగా, ప్రజా క్షేమమే ఆకాంక్షగా సాగుతున్నా తనకు ఒక్క అవకాశం ఇవ్వండని వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కిరణ్ పట్టభద్రులను కోరారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎలక్షన్ లో విద్యావంతులు, మేధావులు, ఆలోచించి ఓటు వేయాలన్నారు. మార్నింగ్ వాక్ లో ఆయనకు ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ప్రశ్నించే తత్వం ఉన్నవారిని శాసనమండలికి పంపించాలిసిన బాధ్యత ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ మీద ఉందన్నారు. కాబట్టి, మహాత్మా జ్యోతిరావు పూలే, పెరియార్, అంబేద్కర్ ఆశయాలతో ప్రజా సేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని నాకు అండగా నిలవాలని కోరారు. విద్యావంతుడిగా నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలించాలని ప్రచారం చేశారు. రాయిశెట్టి వెంకన్న, పెరుమాండ్ల రవి, తేరాల సొమ్మన్న, కిన్నెర యాకయ్య, మంకాల మల్లేష్, వీరసోములు, లక్ష్మణ్, యాకేందర్, బాలాజీ, రాజశేఖర్, మురళీ, చంటి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఖమ్మం నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తులు శ్రీనివాస్ యాదవ్, మండల కోఆర్డినేటర్ కాలం రవీందర్ రెడ్డి కోరారు. ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ ఆదేశానుసారం పట్టణ కేంద్రంలో శనివారం పట్టభద్రుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు.. గత ప్రభుత్వ లో నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగుల ఉద్యోగ ఉపాది అందక నిరాదరణకు గురయ్యారన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారని చెప్పారు. ప్రజా గొంతుకను చట్టసభలో వినిపించేందుకు మల్లన్నను ఎమ్మెల్సీగా ఎన్నుకొని చట్టసభకు పంపిస్తే నిరుద్యోగ యువతకు అండగా నిలబడతారని వివరించారు. మల్లన్న గెలుపు ఖాయం అయినప్పటికీ భారీ మెజార్టీతో గెలిపించేందుకు బాధ్యయుతంగా కృషి చేయాలని కోరారు. సదస్సులో నాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, శీలం శ్రీనివాస్, ఇల్లటూరి వీరస్వామి, కాసం శేఖర్, వాంకుడోతు వీరన్న, సురేష్ నాయక్, తారా చంద్, భాస్కర్, రెడ్డబోయిన శంకర్, బిక్కసాని రామకృష్ణ, మల్లం అనిల్, వాజీద్, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

# సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి రాకేశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి విద్యావేత్త మంచి మేధావి అయిన ఏనుగుల రాకేశ్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిపించినట్లయితే పట్టభద్రుల సమస్యలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కార మార్గం కోసం నేటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ మరుపల్ల రవి డివిజన్లోని ఓటు హక్కు కలిగిన వారి ఇళ్లలోకి వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి ఓట్లు వేయాలని పట్టభద్రులను కోరారు. పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్ రెడ్డి ఎటువంటి మచ్చలేని వ్యక్తి అని, సేవా భావం నిస్వార్థపరులైన వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. డివిజన్ అధ్యక్షులు పూజారి విజయ్, వనం కుమార్, కోరే కృష్ణ, అంకం దేవానంద్, మరుపల్ల గౌతం, కళ్యాణపు వెంకటేశ్వర్లు, గజ్జి సాంబయ్య, సాదుల రంజిత్, శెట్టి మోహన్, చీర రమేష్, ఎంబా ఫరీద్, మరుపల్ల దీక్షిత్, గుడిమల్ల కల్పన, పుట్టబత్తుల స్రవంతి, సుమలత, నామాల రాజులు పాల్గొన్నారు. 40వ డివిజన్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేతి చంద్రశేఖర్ ప్రచారాన్ని పర్యవేక్షించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

## కలెక్టర్ సిక్తా పట్నాయక్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం, వసంతపూర్ గ్రామాల్లో ఓరుగల్లు డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తుండగా శనివారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, తూకం వేసిన ధాన్యం తరలింపు, తదితర వివరాలతో పాటు తేమశాతం ఎంత తీస్తున్నారనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా ఎంత ధాన్యాన్ని తూకాలు వేయాల్సి ఉందని కలెక్టర్ ఆడిగారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో టార్పాలిన్ కవర్లు ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు వెంటనే తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ అధికారి విజయ భాస్కర్ రెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించాలి..**




ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను సకాలంలో కుట్టి అందించేందుకు బాధ్యత తీసుకున్న మహిళా సంఘాలు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను కుడుతున్న కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని యూనిఫాంలను కుట్టారనే వివరాలను బాధ్యత తీసుకున్న మహిళా సంఘాల నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల పున ప్రారంభం సమీపిస్తున్న నేపథ్యంలో స్కూల్ యూనిఫాంలను సకాలంలో అందించాలన్నారు.

## కాంగ్రెస్ నేతల విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ పార్టీ బలపరచిన వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని ఆకాంక్షిస్తూ, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో శనివారం ఉదయం పరకాల పట్టణంలోని పట్టభద్రులను కాంగ్రెస్ నేతలు, నాయకులు కలిసి ప్రచారం చేశారు. బ్యాలెట్ పేపర్ లో సీరియల్ నెంబర్ రెండవ వరుసలోని తీన్మార్ మల్లన్న ఎదురుగా ఉన్న బాక్స్ లో మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, కరపత్రం చూపిస్తూ ప్రచారం నిర్వహించారు. పరకాల మాజీ శాసన సభ్యుడు మొలుగూరి భిక్షపతి, పట్టణ ఇంచార్జి గుండపు చరణ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కోయ్యడ శ్రీను, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, కోలుగురి రాజేశ్వర్ రావు, రంజాన్ అలీ, డాక్టర్. మడికొండ శ్రీను, మెరుగు శ్రీశైలం గౌడ్, చందుపట్ల రఘు, ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్, ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, దుబాసి వెంకట స్వామి, పసుల రమేష్, ఒంటెరు చిన్న సారయ్య, జాఫర్ రిజ్వి, బండి శ్రీధర్, బొచ్చు భాస్కర్, బండారి జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థికి అండగా నిలవండి



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నిక ల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి (1) మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పరకాల మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంత్ లాల్ పిలుపునిచ్చారు. శనివారం పరకాల పట్టణంలోని పలు వార్డులలో ఉదయం ప్రచారం నిర్వహించారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి చిన్నతనంలోనే జాతీయవాదానికి ఆకర్షితుడై ఏబీవీపీలో చేరి విద్యార్థి ఉద్యమాలు, సామాజిక కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. బీజేపీలో చేరి తెలంగాణ ఉద్యమంలోనే ముందు వరుసలో నిలిచి తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ వైఫల్యాలను , విధానాల లోపాలను ఎత్తి చూపుతూ ప్రజల గొంతుకగా నిలబడ్డారన్నారు. పట్టభద్రుల, నిరుద్యోగుల, ఉద్యోగుల, ఉపాధ్యాయుల, విద్యావంతులు సమస్యల పై ప్రశ్నించే వ్యక్తిని శాసనమండలికి పంపించాలని కోరారు. బీజేపీకి ఓటు వేసి నరేంద్ర మోడీకి మద్దతు తెలపాలన్నారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పక్కన 1 అంకె వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరాఠి నర్సింగరావు, వేణు శెట్టి రాజేష్, పున్నం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ లక్ష్మీగణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద శనివారం దేవులపల్లి సంధ్య-నరేష్ ఉజ్వల ఎంటర్ప్రైజెస్, వారి అబ్బాయి దేవులపల్లి ప్రితమ పుట్టినరోజు సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్సా కృష్ణ, గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు గాజుల రాజేష్, బండారి లక్ష్మణ్, సభ్యులు కోట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామానికి అర్శనపల్లి శ్రీ రాం భూపాల్ వ్యక్తి అలియాస్ కన్నారావు తండ్రి జనార్ధన్ వరంగల్ జిల్లాకు చెందిన ఒక నిరుపేద వ్యక్తిని కులం పేరుతో పలుమార్లు దూషించినందుకు బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిపై ఐనవోలు ఎస్ హెచ్ఓలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ : 294-బి, 506 ఐపీఎస్, 3(1)(ఆర్)(ఎస్),3(2)(వీఏ) ఎస్సీ,ఎస్టీ పీఓఏ ఆక్ట్ క్రింద ఎఫ్ఐ ఆర్ నమోదు చేసినట్లు బాధితుడు తెలిపారు. మళ్లీ ఎవరిపై ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారుడు పోలీసులను కోరాడు.

## రాకేష్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఖమ్మం-నల్గొండ- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి ఏనుగుల రాకేశే రెడ్డిని గెలిపించాలని 37వ డివిజన్ లో కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ ఆధ్వర్యంలో తూర్పు కోట, పడమర కోట, మైనారిటీ కాలనీ, గిరిప్రసాద్ నగర్, జంగాల కాలనీలలో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సువర్ణ సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్దులుగా పోటీ చేస్తున్న వారిలో ఉన్నత చదువు చదువుకొని మంచి ఉద్యోగం ఉన్న వదులుకొని ప్రజా సేవలో నీతిగా, నిజాయితీగా పని చేసే అభ్యర్థి రాకేష్ రెడ్డి అని, తనని గెలిపిస్తే నిరుద్యోగ యువతకు, పేద చదువుకునే విద్యార్థుల కోసం తన వేతనం ఖర్చు చేస్తానని చెప్పాడన్నారు. అలాంటి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్, నాయకులు ఉమేష్, శ్రీధర్ రెడ్డి, అరుణ్, అమర్, ప్రభాకర్, నాగరాజు, చరణ్, ఎల్లయ్య, శ్యామ్, సతీష్, సన్నీ, నవీన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు మద్దతుగా ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొండా దంపతుల ఆదేశానుసారంగా 34వ డివిజన్ లో వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీగా నిలబడిన తీర్మాన్ మల్లన్న రెండో నెంబర్ మీద మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టబద్రులైన ఎమ్మెల్సీ ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో 34వ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాసరావు, సాంబయ్య సతీష్, కిరణ్, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను గెలిపించాలని డాక్టర్ మడికొండ శ్రీను, అడ్వకేట్ పెద్దెల్లి ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించడం వల్ల విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన, తెలంగాణలో సబ్బండవర్గాల ప్రక్షాన ప్రశ్నించడాన్ని పోరాడటానికి మండలికి పంపించినట్లు అవుతుందని డాక్టర్ మడికొండ శ్రీను తెలిపారు. ప్రశ్నించే గొంతుక, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలును ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి, నిఖార్సైన జర్నలిస్టుగా పేరుపొందిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు.

## ఏనుగుల రాకేశ్ రెడ్డిని గెలిపించండి



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ పరకాల పట్టణంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. అలాగే, దామెర మండల కేంద్రంలో సమన్వయ కమిటీ, క్లస్టర్ ఇంచార్జిలతో సమావేశం నిర్వహించి ఏనుగుల రాకేశ్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## గుజ్జుల ప్రేమేందర్‌కు ఓటేయండి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని కటాక్షపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులను బీజేపీ నాయకులు కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పెద్ద బ్లాక్ మెయిలర్, మల్లన్నకు గత ఎన్నికల్లో ఉన్న సానుభూతి ఇప్పుడు లేదన్నారు. అతడు ఒక అవకాశవాదని పట్టభద్రులు మొహమాటం లేకుండా చెబుతున్నారని అన్నారు. ప్రేమేందర్ రెడ్డిని గెలిపిస్తామని మాట ఇస్తున్నారని తెలిపారు. మోసపోయి గోసపడ వద్దని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రతిపక్ష నాయకుడైతే ప్రజల తరఫున, నిరుద్యోగ సమస్యలపై శాసనమండలిలో అధికార పార్టీని నిలదీసి అడిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, మండల ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి రాజు, ఎండీ నజీర్, వినయ్, జయరామ్, సందీప్, గణేష్, అభి పాల్గొన్నారు.

# 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటేయచ్చు

## కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) లేకుంటే 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపెట్టి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డు లేని వాళ్లు ఆధార్ కార్డు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ జాబ్ కార్డు, బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ వారిచే జారీ చేసిన పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్.పి.ఆర్. కింద ఆర్ జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు ఫొటోతో జారీ చేసిన ఐడీ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన ఐడీ కార్డు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు (యూడీఐడీ)లలో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని తెలిపారు. జిల్లా లో పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును ఎన్ని పనులు ఉన్నా పోలింగ్ రోజు మే 27న సమయం కేటాయించి తమ ఓటు హక్కును విధిగా వినియోగించు కోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఆ ప్రకటనలో కోరారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వరంగల్–ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని అమ్మాపురం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముద్దం వీరారెడ్డి కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు పట్టభద్రుల ఇంటికెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముద్దం వీరారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డిని శాసన మండలికి పంపించాలని అన్నారు. పుట్టిన ఓరుగల్లు రుణం తీర్చుకోవడానికి విదేశాలలో లక్షల జీతాన్ని వదులుకొని వచ్చిన వ్యక్తి అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి పట్టభద్రులు మోసపోవద్దని సూచించారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గుంటుక వెంకటేష్, నాయకులు యాసారపు వెంకటేశ్వర్లు, మార్క శ్రీనివాస్ గౌడ్, బొమ్మెర బాషా, జనగాం యాకయ్య, ఏనుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ కన్నె రాజు





**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలం పున్నేలు గ్రామానికి చెందిన కొమురవెల్లి విజయలక్ష్మి (దివ్యాంగురాలు) గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) తన పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకులు అందజేశారు. విజయలక్ష్మికి భర్త, తల్లిదండ్రులు చనిపోవడం జరిగిందని, పిల్లలు, సొంత ఇల్లు కూడా లేదని, ఇటీవల ఆమె చేయి కూడా విరగడం జరిగిందని బొల్లికుంట గ్రామానికి చెందిన దేవర రాజు ద్వారా తెలుసుకున్న కన్నె రాజు తన పుట్టినరోజు సందర్భంగా 25కేజీల బియ్యం, 10 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. తన పుట్టినరోజు సందర్భంగా ఈ అవకాశం కల్పించిన బొల్లికుంట గ్రామానికి చెందిన దేవర రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం




**వరంగల్ వాయిస్, దంతాలపల్లి :** మండలంలోని బొడ్లాడ గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ నల్గొండ ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. అభ్యర్థికి తీన్మార్ మల్లన్నకు ఒకటో నెంబర్ వేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్, మండల నాయకులు పొన్నోటి బాలాజీ, తండ రాములు, బొడ్లాడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదరబోయిన నాగయ్య, మాజీ ఉప సర్పంచ్ బొడ్డుపెల్లి వెంకన్న, ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షుడు ఎస్.వెంకన్న, కొత్తపెల్లి క్రాంతి, జె.అశోక్, ప్రసాద్, మధు, సుధాకర్, రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోటలో దొంగల బీభత్సం

## తాళం వేసిన రెండు ఇళ్లల్లో చోరీ

## భారీగా నగదు, బంగారం అపహరణ





**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** దొంగలు తాళం వేసి ఉన్న రెండు ఇళ్ల తాళాలు పగల గొట్టి నగదు, ఆభరణాలు చోరీకి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న బానోత్ వెంకటేశ్వర్లు–అనిత దంపతులు తమ స్వగ్రామం రెడ్డిగూడెంలో రైస్ మిల్లు నిర్మాణం చేపట్టేందుకు రూ.4 లక్షల 70 వేలు అప్పుగా తెచ్చి ఇంట్లోని డ్రెస్సింగ్ టేబుల్ లో దాచి పెట్టారు. రాత్రి హాస్పిటల్ లో విధులు నిర్వహించేందుకు దంపతులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. విధులు ముగించుకొని మరుసటి రోజు ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా డ్రెస్సింగ్ టేబుల్ లో దాచి ఉంచిన రూ.4లక్షల 70 వేలు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ట్రాన్స్ కోలో పని చేస్తున్న మహమ్మద్ ఖదీర్ బంధువుల ఇంట్లో వేడుకకు మరో గ్రామానికి వెళ్ళి తిరిగి వచ్చే సరికి దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి బీరువాలో దాచిన తులం బంగారు, 12 తులాల వెండి ఆభరణాలు, రూ.4 వేలు నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు క్లూస్ టీమ్ తో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో గస్తీని ముమ్మరం చేసి దొంగల బారీ నుంచి రక్షించాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

# తీన్మార్ మల్లన్నకు భారీ మెజార్టీ ఖాయం

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ సమావేశం, హనుమకొండ ప్రెస్ క్లబ్ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరు కాగా, హనుమకొండ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. రామకృష్ణ గారు మాట్లాడుతూ వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లలో తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రులకు డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరికి అర్థం అయ్యే పద్ధతిలో చెప్పాలన్నారు. బ్యాలెట్ బాక్స్ లో రెండో నెంబర్ కాంగ్రెస్ పార్టీ పేరు ఉంటుందని, మల్లన్న పేరు ఉంటుందని, చెయ్యి గుర్తు ఉండదు కాబట్టి, అక్కడ ఒకటో నెంబర్ ను రాయాలని చెప్పాలని సూచించారు. మల్లన్నను గెలిపించుకుంటే ప్రభుత్వానికి వారధిగా మన సమస్యలు తీరుస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉందని, కేంద్రంలో వచ్చేది కూడా కాంగ్రెస్ పార్టీయే కాబట్టి, అన్ని విధాలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రెటరీ ఎంవీ లాజరెస్, ఎస్సీ డిపార్ట్ మెంట్ సెక్రటరీ ఈర మహేందర్, మాతంగి రాజు, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐపీటీఏ ఆవిర్భావ దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఐపీటీఏ ఆవిర్భావ దినోత్స వాన్ని జయప్రదం చేయాలని గన్నారపు రమేష్, నంది అవార్డు గ్రహీత దామెర విజయ్ కుమార్ అలియాస్ కృష్ణ అన్నారు. ఇప్టా జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ మే 25, 1943లో బొంబాయి మహా నగరంలో సరోజని నాయుడు అధ్యక్షతన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియెషన్ ఏర్పడింది. కళ కళ కోసం కాదు.. కళ ప్రజల కోసం అని నమ్మి ఎంతోమంది ప్రజాకళాకారులు తమ ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. మా భూమి, ముందడుగు, రక్త కన్నీరు లాంటి అనేక నాటకాలతో ప్రజలను చైతన్యవంతులను చేయడం జరిగింది. గరికపాటి రాజారావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏర్పాటు చేసి రక్త కన్నీరు, నాగభూషణం, జమున, అల్లు రామలింగయ్య వంటి వారు ఎంతోమంది ప్రజానాట్యమండలిలో పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కవులు, కళాకారులైన సుద్దాల హనుమంతు తమ గానాలతో తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసి రజాకార్ల, భూస్వామ్య గుండాలను తరిమికొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి రాంపల్లి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, మున్ని, సాంబలక్ష్మి, సుప్రియ, హరిబాబు, సీనియర్ కళాకారుడు వెంకటాద్రి, గన్నారావు మస్తాన్ పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొండా దంపతులు ఆదేశాల ఖమ్మం–నల్గొండ– వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం 27వ డివిజన్ లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ దయానంద్ కాలనీలోని నివాస గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి గ్రాడ్యుయేట్ తీన్మార్ మల్లన్న బ్యాలెట్ లోని రెండో నెంబర్ లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా దంపతుల నాయకత్వంలో భారీ మెజార్టీ వస్తుందన్నారు. ప్రతి డివిజన్ లో కాంగ్రెస్ నాయకులు పట్టభద్రులను కలసి తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారన్నారు. 27వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గూడ శారద, కాంగ్రెస్ నాయకులు గుల్లపల్లి రామకృష్ణ, జంగం ప్రభాకర్, ఎర్రం కమల్, మంద శ్రీనివాస్, పోలెపాక విశాల్, బాబు షాబాదు, యోగి సర్దార్, జస్వీర్ సింగ్, కొండమీది సదానందం, కట్కూరి అన్వేష్, దౌడు నాగరాజ్, గూడ లావణ్య, నవీన్, గుండం సురేందర్, కేతువాసి విష్ణు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

## భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, రేగొండ :** జూన్ 10లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం మండలంలోని బాగిర్తిపేట, గూడెప్పల్లి, మడత పల్లి, రంగయ్యపల్లి, గోరి కొత్తపల్లి మండలంలోని రూపిరెడ్డిపల్లి, చిన్న కోడెపాక గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకునేందుకు అనువుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనకు మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఒక్క పని పెండింగ్ లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలో 26 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. కోటి 17 లక్షలతో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలల్లో కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్, ప్లాట్ ఫామ్ వంటి మౌలిక వసతులుతో పాటు చిన్న, చిన్న మరమ్మత్తు పనులు సైతం పూర్తి చేయాలన్నారు. బాగిర్థిపేట జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మరమ్మత్తులకు రూ.4 లక్షల 20 వేలు, గూడెప్పల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.8 లక్షల 50 వేలు, మడతపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు రూ.3 లక్షల 95 వేలు, రంగయ్యపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.6 లక్షల 55 వేలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. భాగిర్తి పేట గ్రామంలో స్రైనేజి మోరిలు పగిలి పోవడం వల్ల రవాణాకు ఇబ్బంది కలుగుతుందని, నూతన మోరిలు నిర్మించాలని గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు పరిశీలించిన కలెక్టర్ మోరిలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందచేయాలని ఎంపీడీఓకు సూచించారు. అలాగే గోరికొత్తపల్లి మండలంలోని రూపిరెడ్డి పల్లి ప్రైమరీ పాఠశాలకు రూ.3.95 లక్షలు, చిన్న కోడేపాక ప్రైమరీ పాఠశాలకు రూ.3.70.లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10.70 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాలల్లో మైదానాలను ఉపాధి హామీ పథకం నిధులతో చదును చేపట్టాలని అన్నారు. రానున్న హరితహారంలో పండ్ల మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చిన్నకోడేపాక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్ వాడీ భవనం మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శామ్యూల్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రామ్ ప్రసాదరావు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రాజు, వీఓలు సుజాత, లావణ్య, సుమలత, శోభ, స్వప్న, రమాదేవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** హైదరాబాదులోని బొమ్మల రామారావు ఏరియాలో పారిశుద్ధ కార్మికురాలిపై లైంగిక వేధింపులు చేసిన సానిటరీ ఇన్ స్పెక్టర్ కిషన్ ను, దానిని సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ప్రణయ్ ని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రజల మున్సిపల్ వర్కర్స్ యూనియన్( ఐఎఫ్ టీయూ అనుబంధం) బ్రాంచ్ అధ్యక్షుడు మంగళపల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. నేడు తొర్రూరులోని ఐఎఫ్ టీయూ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై ప్రసంగిస్తూ మున్సిపల్ సిబ్బందిపై అధికారులు అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని హేళనతో అవమానాలకు భరిస్తున్నారని అన్నారు.పారిశుద్ధ కార్మికులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డా, అవమానకరంగా మాట్లాడినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే మున్సిపల్ సిబ్బంది ఆందోళన బాట పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మహేందర్, కోశాధికారి అర్వపల్లి వెంకన్న, యూనియన్ జిల్లా నాయకులు మంగళపల్లి భిక్షపతితో పాటు రామస్వామి, సోమయ్య, నవీన్, లింగయ్య, ప్రభాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం బలోపేతానికి కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి:** ప్రజల కోసం పోరాడే సీపీఎంను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు కోరారు. శనివారం మండలంలోని కుర్చపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ సమావేశం పి.నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ముఖ్యమైన వాగ్దానాలను గ్యారంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా డబ్బులు రాని రైతులందరికీ తక్షణమే రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలని అన్నారు 2 లక్షల రైతు రుణమాఫీ చేసి కొత్తగా రుణాలు రైతులకు ఇవ్వాలని అన్నారు. కుర్చపల్లి గ్రామంలో శనివారం అనారోగ్యంతో మరణించిన సీపీఎం సానుభూతిపరుడు తోకల మైసయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి సీపీఎం జిల్లా, మండల, గ్రామ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, గ్రామ కార్యదర్శి కాసాని పుల్లయ్య, గ్రామ కమిటీ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ మంచాల మల్లేష్, గ్రామ నాయకులు టి.నరేష్, తోకల రాజు, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతి బాయి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడం వలన వివిధ రకాల వ్యాధులు సంక్రమిస్తాయని, ఇందుకు వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత విభాగాలైన పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ అభివృద్ధి శాఖలు వివిధ చర్యలు, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అయితే ఇందులో ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి పేర్కొన్నారు. శనివారం సబ్ యూనిట్ ఆఫీసర్లకు, హెల్త్ సూపర్ వైజర్లకు, హెల్త్ అసిస్టెంట్లకు రాబోయే వర్షా కాలంలో తీసుకోవాలిసిన జాగ్రత్తలపైజిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సిబ్బంది ప్రతిరోజు క్షేత్ర స్తాయిలో వారికి కేటాయించిన గ్రామాలలో వర్షాకాలంలో నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాప్తిచెందే అతిసార, పచ్చకామెర్లు, గ్యాస్ట్రో ఎంటరైటిస్, మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఏమైన ఉన్నాయా తెలుసుకొవాడనికి నిరంతరం గృహ సందర్శన చేసి వారికి తగిన సలహాలు, సూచనలు, మందులు ఇవ్వాలని తెలిపారు. కీటక జనిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి కలిగించే ఎనాఫిలిస్, క్యూలెక్స్ దోమలు ఎక్కువగా నీటి నిల్వలు, మురికి గుంటలు, సెప్టిక్ ట్యాంక్ లలో వృద్ధిచెందుతాయని అన్నారు. డెంగీ, చికెన్ గున్యా వ్యాప్తి చేసే ఏడిస్ దోమలు ఇండ్లలో, పరిసరాలలో నిల్వ ఉండే కొద్దిపాటి నీటిలో కూడా పెరుగుతాయని, ఇవి ఎక్కువగా పగటి పూట కుట్టుతాయని తెలిపారు. వారానికి ఒక రోజు డ్రైడే గా పాటించి ఇంటి లోగల వంట పాత్రలు, నీటి డ్రమ్ములు, నీరు నిల్వ ఉంచే ఇతర పాత్రలను ఖాళీ చేసి తోమి ఆరబెట్టి తిరిగి నీరు నిల్వ చేసుకోవాలని, దీని వలన నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టకుండా, లార్వా పెరగకుండా నివారించడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష మాట్లాడుతూ తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన లేదా కాచి చల్లార్చి వడపోసిన నీటినే త్రాగుటకు ఉపయోగించాలని, పైపులైన్ ల లీకేజీలను వెంటనే సరి చేయాలని, నల్లాలు గుంతలలో ఉన్నట్లైతే మూసివేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు అంబరీష, డాక్టర్ మురళీధర్, పీఓఎన్‌సీడి డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ సుధీర్ రెడ్డి, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్, ప్రసాద్, హెల్త్ ఎడ్యు కేటర్లు, మహేందర్ రెడ్డి, పురుషోత్తమ్, కేవీ రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్లు గోపిచంద్, శ్రీనివాస్, హెచ్ఈఓ రామకృష్ణ, ఎన్‌హెచ్ఎం డీపీఓ రుక్ముద్దీన్,సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజాజీనగర్ నుంచి బొక్కలగడ్డ వరకు ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉన్నా వెంటనే వాటిని తొలగింపు చర్యలు చేపట్టి నయీంనగర్ నాలా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి నయీంనగర్ నాలా నిర్మాణ పనులపై రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సర్వే, సాగునీటి పారుదల, ఇతర శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నయీంనగర్ నాలా నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులను ఆయా శాఖల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నయీంనగర్ నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా వరద ప్రభావంతో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా నయీంనగర్ నాలా నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. నాలా ఆక్రమణల తొలగింపు చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నాలా స్థలం ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, గ్రేటర్ వరంగల్ ఈఈ రాజయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెద్దకోడపాకలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం పెద్దకోడపాక గ్రామంలో భారత జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉన్న వారిని మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి రవీందర్, దాసరి రవి, అమ్మ రవి, ముల్కనూర్ చంద్రమౌళి, ముజిగిరి వేణు, సాదు శీను తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచించి అర్హుడినే ఆశీర్వదించండి

### బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి పట్టభద్రులను కోరారు. చట్టసభలో పట్టభద్రుల గౌరవాన్నిపెంచుతూ, ప్రజల గొంతునై ప్రతీ సమస్య పై అలుపెరుగని పోరాటం చేస్తానని తెలిపారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ మొదటి (1) ప్రాధాన్యత సీరియల్ నెంబర్ 3లో గల తనకు వేసి గెలిపించండని కోరారు. ఆలోచించి అర్హుడినే ఆశీర్వదించాలన్నారు. యువకుడు, ఉన్నత విద్యావంతుడు, సౌమ్యుడు, అద్భుతమైన వాగ్ధాటి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన శ్రీ ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించి శాసన మండలికి పంపిద్దామని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మనకు ఇప్పుడు కావాల్సింది ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు.. ప్రశంసించే గొంతు కాదని తెలిపారు. ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో మన మొదటి ప్రాధాన్యత ఓటు ఏనుగుల రాకేశ్ రెడ్డికి వేసి గెలిపిద్దామన్నారు.




# బుజ్జి చూసి ముచ్చటపడ్డ నాగచైతన్య

ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా బుజ్జి టాపిక్కే నడుస్తోంది. బుజ్జి అంటే మనిషి కాదు. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న కల్కి 2898 ఎడి' చిత్రంలో కీలక పాత్ర పోషించే కారు అది. ఇటీవల 'బుజ్జి'ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ చిత్రం కోసమే ప్రత్యేకంగా ఆ కారును డిజైన్ చేశారు. తాజాగా యంగ్ హీరో నాగచైతన్య బుజ్జిని కలిశారు. బుజ్జిని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసం 'కల్కి' టీమ్ ఓ ఈవెంట్ చేసింది. దానిలో బుజ్జితో పాటు ఎంట్రీ ఇచ్చాడు ప్రభాస్. ఎఫ్ 1 రేసింగ్‌లో ఉపయోగించే కారులాగా ఉన్న బుజ్జిని చూసి చాలామంది ఇంప్రెస్ అయ్యారు. అలా ఇంప్రెస్ అయినవారిలో నాగచైతన్య కూడా ఒకడు. అందుకే బుజ్జిని డైరెక్ట్‌గావెళ్లి చూశారు. బుజ్జితో ఒక రైడ్‌కు వెళ్లాడు. దాని తయారీని చూసి ఆశ్చర్యపోయాడు చైతూ. 'నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. మీరు ఇంజనీరింగ్‌కు సంబంధించిన అన్ని రూల్స్‌ను బ్రేక్ చేశారు' అంటూ బుజ్జిని తయారు చేసిన టీమ్‌ను ప్రశంసించారు నాగచైతన్య. ఆయన బుజ్జిని కలవడం, దాంతో రైడ్‌కు వెళ్లడాన్ని వీడియోగా తీసి తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది వైజయంతీ మూవీస్. అలాంటి హీరో బుజ్జితో రైడ్‌కు వెళ్లిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీన్నిబట్టి చూ?స్త 'కల్కి 2898'ను ప్రమోట్ చేయడానికి మరెందరో తెలుగు స్టార్లు రంగంలోకి దిగుతారని తెలుస్తోంది. ఇప్పటికే బుజ్జికి వాయిస్ ఓవర్ చెప్పడానికి కీర్తి సురేశ్ ముందుకొచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 27న విడుదలకు సిద్ధమయ్యింది.



# దర్శకుడి తడబాటు



దిల్‌రాజు కుటుంబం నుంచి వచ్చి హీరోగా తెరకు పరిచయమయ్యారు ఆశిష్. తొలి ప్రయత్నంలో 'రౌడీ బాయ్స్'తో మిశ్రమ ఫలితాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు రెండో ప్రయత్నంలో 'లవ్ మీ'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. 'బేబీ'తో మెప్పించిన వైష్ణవి చైతన్య నాయికగా నటించడం.. టీజర్, ట్రైలర్లకు ఆదరణ దక్కడం.. ప్రేక్షకుల్లో దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ర్జున్ (ఆశిష్)కు దేవుడు, దెయ్యాలపై అసలు నమ్మకం ఉండదు. ఎక్కడైనా దెయ్యాలున్నాయని తెలిస్తే చాలు అక్కడికి వెళ్లి.. అవి లేవని సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తుంటాడు. ఆ వీడియోలన్నింటినీ తన యూట్యూబ్ ఛానెల్‌లో పెట్టి డబ్బులు సంపాదిస్తుంటాడు. ఈ విషయంలో అతనికి తన సోదరుడు ప్రతాప్ (రవికృష్ణ) కూడా సహాయ పడుతుంటాడు. ఈ క్రమంలో ఓసారి అర్జున్‌కు ప్రతాప్ ప్రియురాలు ప్రియ (వైష్ణవి చైతన్య) ద్వారా దివ్యవతి అనే దెయ్యం గురించి తెలుస్తుంది. తెలంగాణ – కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఓ ఊరిలోని పాడుబడ్డ అపార్ట్‌మెంట్‌లో ఆ దెయ్యం తిరుగుతోందని.. ఆమె గురించి తెలుసుకోవాలని ప్రయత్నించిన చాలా మందిని హతమార్చిందని తెలుసుకుంటాడు. ఆ కథ విన్నాక అర్జున్ ఎలాగైనా ఆ దెయ్యాన్ని తన ప్రేమలో పడేయాలని నిర్ణయించుకుని అక్కడికి వెళ్తాడు. మరి ఆ తర్వాత తనెలాంటి పరిణామాల్ని ఎదుర్కొన్నాడు? దివ్యవతి కథేంటి? ఆమెకు గతంలో కనిపించకుండా పోయిన పల్లవి, నూర్, ఛరిష్మాలకు ఉన్న సంబంధం ఏంటి? అసలు దివ్యవతి కథను అర్జున్ దగ్గరకు ప్రియ ఎందుకు చేర్చింది? అన్నది సినిమా కథ. విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కిన రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఓ యువకుడు దెయ్యాన్ని ప్రేమలో దింపాలని ప్రయత్నిస్తే ఎలాంటి పరిణామాలెదురయ్యాయన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. ఇలాంటి కథ విషయంలో కొత్త దర్శకుడు అరుణ్ భీమవరపు అనుభవం సరిపోలేదనిపిస్తుంది. తాను రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని లాజికల్‌గా ప్రేక్షకులు కన్విన్స్ అయ్యేలా చెప్పడంలో తడబడ్డారు. దీనికి తోడు సినిమాలో ట్విస్ట్‌లా సెట్ చేసి పెట్టుకున్న అమ్మాయిల మిస్సింగ్ పాయింట్ కథను, ప్రేక్షకుల్ని పూర్తిగా గందరగోళానికి గురి చేసింది. అర్జున్ చిన్నతనంలో తన ఊరిలో జరిగిన ఓ అసాధారణమైన మిస్టరీని చూపిస్తూ కథను ఆరంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇక ఆ తర్వాత దెయ్యాలు లేవని నిరూపించడంలో అర్జున్ శక్తిసామర్థ్యాల్ని పరిచయం చేస్తూ ఓ హారర్ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. కానీ, అదంత థ్రిల్లింగ్‌గా అనిపించదు. అర్జున్ ప్రపంచం.. ప్రతాప్‌తో కలిసి చేసే ప్రయాణం.. ప్రియ పరిచయ సన్నివేశాలు.. అన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. ప్రియ.. దివ్యవతి కథను అర్జున్‌కు పరిచయం చేసినప్పటి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ దెయ్యాన్ని ప్రేమిస్తానంటూ అర్జున్ ఆమె అపార్టుమెంట్‌కు వెళ్లడం.. ఆరంభంలో అక్కడ తనకు ఎదురయ్యే అనుభవాలు.. అక్కడి ప్రపంచం.. అన్నీ థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. దీనికి తగ్గట్లుగానే ద్వితీయార్థంపై అంచనాలు పెంచేలా విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న తీరు బాగుంది. దివ్యవతి దెయ్యం కాదు బతికే ఉందని నిరూపించడం కోసం అర్జున్ చేసే అన్వేషణతో ద్వితీయార్థం ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ క్రమంలోనే కనిపించకుండా పోయిన ముగ్గురు అమ్మాయిల ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఇక ప్రియ పాత్రలోని ట్విస్ట్ ఊహలకు అందేదే అయినా అర్జున్ పాత్ర వెనకున్న చిన్న మిస్టరీ కాస్త సర్‌ప్రైజ్‌కు గురి చేస్తుంది. రెండో భాగానికి లీడ్ ఇస్తూ క్లైమాక్స్‌లో సెట్ చేసిన ట్విస్ట్ థ్రిల్లింగ్‌గానే ఉంది. దర్శకుడు అరుణ్ రాసుకున్న కథలో కొత్తదనమున్నా.. దాన్ని అంతే ఆసక్తికరంగా తెరపైకి తీసుకురాలేకపోయాడు. ఫస్టాఫ్‌లో కొంత వరకు కథ అక్కడక్కడే తిరిగిన అనుభూతి కలుగుతుంది. సెకండాఫ్‌లో బాగా కంగాళిగా తయారైంది. ఎం.ఎం.కీరవాణి నేపథ్య సంగీతం సినిమాకి ఆకర్షణ. పాటలు మరీ గుర్తుంచుకునేలా లేవు. ఈ కథకు తగ్గట్లుగా పిసి శ్రీరామ్ డార్క్ టోన్డ్ సినిమాటోగ్రఫీ చక్కగా కుదిరింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

# ఆలాంటి డ్రెస్‌లో ఇష్టం ఉండదు

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన తాజా సినిమా 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. తనకు చరిత్ర అంటే ఎంతో ఆసక్తి అని చెప్పిన జాన్వీ.. బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీల గురించి మాట్లాడారు. 'ఈ ఇద్దరి గురించి వినడం, మాట్లాడటం నాకెంతో ఇష్టం. వీళ్లు మన సమాజానికి ఎంతో సాయం చేశారు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అందుకే ఈ ఇద్దరికీ సంబంధించిన ఏ అంశమైనా నాకు ఆసక్తిగానే ఉంటుంది. కులాలపై అంబేద్కర్ దృక్కోణం ముందునుంచీ చాలా కఠినంగానే ఉండేది. కాలక్రమేణా గాంధీ దాన్ని మారుస్తూ వచ్చారు. మన సమాజంలో కుల సమస్య అనేది ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. కులంపై మూడో వ్యక్తి అభిప్రాయం.. ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వారి అభిప్రాయానికి మధ్య చాలా తేడా ఉంటుంది' అని చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో తన ఫొటోల గురించి జాన్వీ మాట్లాడుతూ.. 'సెలబ్రిటీల తాజా ఫొటోల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురుచూస్తుంటారు. అందుకే తారలు కనిపించగానే ఫొటోగ్రాఫర్లు కెమెరాలతో క్లిక్‌మని పిస్తుంటారు. నేను ఈ సినిమా ప్రమోషన్స్ కోసం 25సార్లు విమానంలో ప్రయాణించా.. విమానాశ్రయానికి వెళ్లేసరికే ఫొటోగ్రాఫర్లు సిద్ధంగా ఉంటారు. ఇక సినీతారల కోసం ఫొటోగ్రాఫర్లు ఎదురుచూసే మరో ప్రదేశం జిమ్. జిమ్ బయట సెలబ్రిటీలను చాలామంది ఫొటోలు తీస్తుంటారు. నన్ను అలా తీయొద్దని చాలాసార్లు అభ్యర్థించాను. ఎందుకంటే జిమ్ చేసే సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు వేసుకుంటాను. ఆ దుస్తుల్లో తీసిన ఫొటోలు వైరలైతే నాకు అలాంటి డ్రెస్‌లే ఇష్టమని అందరూ భావిస్తారు. అందుకే జిమ్ బయట ఫొటోలు దిగడం నాకు నచ్చదు' అని చెప్పారు.





# తీన్మార్ మల్లన్నతోనే..
# పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం

**బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు**

**స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** తీన్మార్ మల్లన్న గెలుపుతోనే పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. శనివారం స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం శ్రీహరి పాల్గొని ప్రసంగించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాడన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. పట్టభద్రులు వివేకంతో అలోచించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ యువతకు చేసింది ఏమి లేదని విమర్శించారు. నరేంద్ర మోడీ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మోసం చేశాడన్నారు. తెలంగాణ విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు.

## బీజేపీని నిలదీయాలి..

గత 5ఏళ్లుగా కిషన్ రెడ్డి మంత్రి వర్గంలో ఉండి తెలంగాణకు ఎం చేశాడో చెప్పాలని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధిలో మీ ప్రాతినిధ్యం ఏమి లేదన్నారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఇస్తున్నారు తప్ప ప్రత్యేకంగా ఎం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని బీజేపీకి తెలంగాణ ప్రజలు ఎందుకు ఓటు వేయాలన్నారు. ఈ విషయంలో తెలంగాణ యువత బీజేపీని నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే నైతిక అర్హత బీజేపీకి లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలపైన ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయకారి ఒప్పందాలు చేసుకున్నాయని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సపోర్ట్ చేసిందన్నారు. కేసీఆర్ కూతురు కవితకు బెయిల్ ఇప్పించాలని, గత ప్రభుత్వ అవినీతి పై విచారణ జరగద్దని ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తె చెత్త బుట్టలో వేసినట్లే అన్నారు. బీఆర్ఎస్ గెలిచేది లేదు..గెలిచినా చేసేది ఎం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉంటుందో..ఉండదో..తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి

**అసత్యపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్**

**ఆ పార్టీ నేతలు రఘునందన్ రావు, అరూరి రమేష్**

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** భారతీయ జనతా పార్టీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రఘునందన్ రావు, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పట్టభద్రుల సమావేశాన్ని నియోజకవర్గ కేంద్రంలోని సిరిపురం గార్డెన్ లో ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రఘునందన్ రావు, అరూరి రమేష్ మాట్లాడుతూ ఎల్లుండి జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లు ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగుతుందో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రేవంత్ రెడ్డి 420 హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టారని ఆరోపించారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి అన్నారు. సీఎంగా భాధ్యతలు చేపట్టగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మరిచారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనైనా నిరుద్యోగులు వాస్తవాలు గ్రహించి ఓటు వేయాలన్నారు. తీన్మార్ మల్లన్న ఎక్కడ చదువుకున్నాడో ఎవరికీ తెలియదన్నారు. ఆయనకు బ్లాక్ మెయిలింగ్ తప్ప మరేదీ రాదన్నారు. ప్రశ్నించే వారిని ఇష్ట మొచ్చినట్టు తిట్టడమే తీన్మార్ మల్లన్న పని దుయ్యబట్టారు. పొద్దున లేస్తే ఇతరులను దుర్భాషలాడుడే తెలిసిన మల్లన్నకు ఎందుకు ఓటు వేయాలిని ప్రశ్నించారు. ఈ నెల 27 వ తేదిన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడు, బీజేపీలోనే 40 సంవత్సరాలుగా సేవ చేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు దశమంత రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు విజయ రావు, సుభాష్, వెంకటేశ్వర్లు, అసెంబ్లీ కన్వీనర్ అంజి రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ యుగంధర్, మహిళ మోర్చ నాయకురాలు విజయలక్ష్మి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు వలి పాషా, మండల పార్టీ అధ్యక్షుడు రమణ, రాజు యాదవ్, నగేష్ గౌడ్, ఉపేందర్, రాజు, ఆంజనేయులు, వేణు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు గట్లపై మొక్కలు నాటాలి

**అందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి**

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

**ఉద్యానవన విభాగ అధికారులతో సమావేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగర పరిధి లోని చెరువు గట్ల వెంట మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన విభాగ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని నీటి వనరులను (చెరువులు, కుంటలను) పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం చెరువు గట్ల వెంబడి మొక్కలను నాటాలన్నారు. ఇందు కోసం తక్కువ సమయంలో ఏపుగా పెరిగే మొక్కలను ఎంపిక చేయాలన్నారు. ఈ క్రమంలో ఔషద గుణాలు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఎకో ఫ్రెండ్లీ లక్షణాలున్న మొక్కల ఎంపికకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొక్కలను నాటే ముందు శానిటేషన్ విభాగం వారి సహకారంతో ఆయా పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. ఇట్టి మొక్కల సీడ్లింగ్ నర్సరీలో పెంచడానికి ఎంత సమయం పడుతుందని కమిషనర్ హెచ్ ఓను అడిగి తెలుసుకున్నారు.

## నర్సరీల పురోగతి ఏంటి..

బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల పురోగతిని హార్టికల్చర్ అధికారి కమిషనర్ కు తెలియజేశారు. నగర వ్యాప్తంగా ఏడు నర్సరీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం మొత్తం మొక్కల లక్ష్యం ఐదు లక్షలు కాగా ప్రస్తుతం నర్సరీల్లో గత సంవత్సరం సిద్ధం చేసిన మొక్కలు 1.80 లక్షలు, ప్రస్తుతం మరో 1.50 లక్షలు మొత్తం 3.30 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్ఎండీఏ వారి సహకారంతో తెల్లాపూర్ నర్సరీ నుంచి 1.50 లక్షల మొక్కలు త్వరలో నగరానికి చేరుకొనున్నాయన్నారు. ప్రజలకు పంపిణీ చేయడానికి హెూం స్టేడ్ మొక్కలు కూడా సిద్దంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వారితో సమన్వయం చేసుకొని బ్యాంబో మొక్కలు అందజేసేలా వారికి లెటర్ రాయాలని, నర్సరీల్లో మొక్కలను పెంచడానికి వీలుగా లక్ష బ్యాగులు తెప్పించుకొని సిద్దంగా ఉంచాలని, నగర వ్యాప్తంగా నీటి వనరులున్న ప్రాంతాలను గుర్తించి సమాచారం అందజేయాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, ప్రవళిక, అనూహ, తదితరులు పాల్గొన్నారు.

# మణికంఠకు అంతర్జాతీయ గుర్తింపు

**వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్‌లో చోటు**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మణి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ గడదాసు మణికంఠకు వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ గుర్తింపు లభించింది. మాస్టర్ గత 15 సంవత్సరాలు నుంచి కరాటేలో అంచెలంచెలుగా ఎదుగుకుంటూ జిల్లా నుంచి ప్రపంచ స్థాయి పోటీలలో ఇటలీ, కజకిస్థాన్, నేపాల్, అబుదాబీ, తదితర దేశాలలో పాల్గొన్నారు. వందలాది మంది విద్యార్థులకు మణికంఠ మాస్టర్ కరాటేలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వరంగల్ లోని ప్రముఖ పాఠశాలలో శిక్షణ ఇస్తూ అలాగే మణి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ స్థాపించి కరాటేలో మంచి గుర్తింపు పొందుతున్న ప్రముఖ కరాటే మాస్టర్ మణికంఠను గుర్తించి వరల్డ్ కరాటే మాస్టర్ అసోసియేషన్ లో చోటు కల్పించింది. మణికంఠకు కరాటేలో అందిస్తున్న సేవలను పరిగణలోకి తీసకొని వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ గుర్తింపు ఇచ్చామని ఆ సంస్థ చైర్మన్, వ్యవస్థాపకుడు బాలమురుగన్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. కరాటేలో తన సేవలు ఎల్లప్పుడూ అందించాలని ఈ సందర్భంగా మణికంఠకు బాలమురుగన్ శుభాకాంక్షలు చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com